# శారికా సంగీతం

"శారీ"

"అలా పిలిస్తే పలకనని చెప్పానా నీకు?" నొసలు చిట్లించింది శారిక.

"ఎందుకు పలకవు?"

"నా ఇష్టం"

"ఆ అక్షరాలు నీ పేర్లో లేవా?"

"ఉంటే ?"

"అసలు మూడక్షరాల పేరు సంఖ్యాశాస్త్రం ప్రకారం నీకు సరిపోదు. చక్కగా రెండక్షరాలైతే నీకు బాగా కలిసొస్తుంది శారీ...."

"అదిగో మళ్ళీ...."

"ఓ అయిదు రూపాయిలు ఖర్చుపెడితే కాలేజిలో కూడా నీ పేరు శారిక అని కొట్టేసి 'శారి' అని మార్చేస్తారు చక్కగా."

"సంతోషించార్లే."

"అసలు నీ ఫ్రెండ్స్‌కి శారిక అంటే అర్థం తెలీకగాని, తెలిస్తే 'గోరువంక' అని ఏడిపించేవాళ్ళే."

"నువ్వు చెప్పరాదూ పోనీ వాళ్ళకి."

"అసలు మా శారిక పేరు అది కాదు, క.శారి కాస్తా స్కూల్ రిజిస్టర్లో శారి.క అయింది. అసలు పేరు 'శారి' అని చెప్తాలే, ఏం?"

"అబ్బబ్బ, చూడమ్మా" చిందులు తొక్కింది శారిక.

"పొద్దున్నే ఏమిట్రా గొడవ!" అని వంటింట్లోంచి వాళ్ళమ్మ కేకేసింది.

రాఘవకి, శారికకి ఇది మామూలే. వాళ్ళ నాన్న స్కూల్లో తెలుగు టీచర్. కావ్యాల్లోని శుక పిక శారికా గీతికా సంగీతాలకి పరవశించి వాటికి ప్రతీకగా పిల్లపేరు శారి.క అని ముద్దుగా పెట్టుకొన్నాడు.

శారిక పేరు రాఘవకి శారి ఎలా అయిందా అనేది ఓ చిలిపి ఘట్టం.

"ఈసారి పుట్టినరోజు పండక్కి నాకు చీర కొనాలిసిందే." నాలుగేళ్ళ క్రితం అంటే, వోణీలు వేసుకునే వయసులో శారిక ఓసారి పేచీ పెట్టింది.

"చాల్లే" అంది వాళ్ళమ్మ.

"కావాలిసిందే."

"ఇప్పటినించే చీరలేమిటే?" అని కోప్పడింది ఆమె. శారిక బుంగమూతి పెట్టింది.

"చీర లేకపోతే నాకసలు పుట్టింరోజు పండగే అక్కర్లేదు."

"నీకు చీర వచ్చే ఉపాయం చెప్పనా?" అన్నాడు రాఘవ.

"ఊ!" అంది ఆశగా.

"నీ పేరులో 'క' తీసెయ్యి."

వాళ్ళమ్మ నవ్వింది.

శారిక నొసలు చిట్లించింది.

"గొప్పేలే...."

"శారీ అంటే చక్కగా ముద్దుగా వుంటుంది."

"సంతోషం."

"పేరు మార్చుకొన్న శుభ సమయంలో నీకో చీర ప్రెజెంట్ చెయ్యమని నాన్నకి రికమెండ్ చేస్తాలే శారీ...." అన్నాడు రాఘవ.

"సంతోషించాల్లే. శారీ....సారీ....అంటే నేనూరుకోను."

"నేను శారీనే అంటాను. శారీ, శారీ, శారీ."

"అబ్బబ్బ, చూడమ్మా అన్నయ్య" అని చిందులు తొక్కింది శారిక.

"ఊరుకోండర్రా" అంటూ వాళ్ళమ్మ లోపలికెళ్ళి పోయింది.

అప్పటినించీ రాఘవ శారికని 'శారీ' అంటూ ఉడికించటం, శారిక ఉడుక్కోటం మామూలే అయింది.

రాఘవ టెన్నిస్ రాకెట్ చేతిలోకి తీసుకొంటూ "శారీ, నేను గెలవాలని కోరుకో" అన్నాడు.

"ఫైనల్సా ఇవాళ?"

"ఊ! ఇంకో అరగంటలో కోర్టులో వీర విహారం."

"గెలుస్తావా?"

"నీ అదృష్టాన్నిబట్టి వుంటుంది."

"నా అదృష్టంట, బావుంది" అంది శారిక.

"అవును మరి, ఆమధ్య గుంటూరు టోర్నమెంట్‌లో గెలిస్తే వెయ్యినూట పదహార్లిచ్చారా! ఇస్తే శారికి ఎర్ర ఎర్రటి కంచి పట్టుచీర వచ్చిందా? ఈసారి పచ్చ పచ్చటిది."

"పచ్చ పచ్చటిదా!" శారీ వదనం ప్రకాశవంతమయింది.

"ఊ! నీకిష్టమే కదూ!"

"అన్నయ్యా" అని ఆమె ఏదో చెప్పబోయింది.

"దేవుడికి కొబ్బరికాయ కొట్టుకో, టైమయింది."

"మరే....మా ఫ్రెండు...."

"మీ ఫ్రెండుకి కూడా ఒకటా? బావుంది, ఊరికే వస్తే...."

"అదికాదు, మరి...."

"మా ఫ్రెండ్‌కి అలాంటి చీర వుంది తెలుసా?"

"మీ ఫ్రెండ్ ఫ్రెండ్ ఒకామె అలాంటి చీర కొంటోంది తెలుసా?"

"ఎవరా అమ్మాయి?" అమాయికంగా అప్రయత్నంగా అంది శారిక.

"శారీ అనే అమ్మాయి."

"పో...." అంది శారిక.

శారిక కళ్ళల్లో వెలుగు చూసి క్షణం పరవశించాడు రాఘవ. అతని హృదయంలో ఆప్యాయత, ప్రేమ వెల్లివిరిశాయి. రెండు నెలల కిందటి దృశ్యం అతని కళ్ళలో మెదిలింది. గుంటూరు టోర్నమెంట్‌లో సింగిల్స్ ఛాంపియన్‌షిప్ గెల్చుకొంటే ట్రోఫీతోపాటు వెయ్యినూటపదహార్లిచ్చారు. అన్నాళ్లూ శారికని శారీ శారీ అని నవ్విస్తూ చిలిపిగా ఉడికిస్తున్నాడు. పిచ్చి పిల్లకి కళ్లు జిగేల్ మనిపించేట్టు ఓ మంచి చీర ప్రజంట్ చేయాలి. ఎర్రటి కంచిపట్టుచీర కొన్నాడు. 'శారీ' అని పిలుస్తూ పేకెట్ తెరిచి చీర ఓ కొనపట్టి గాలిలోకి విసిరాడు. శారిక వదనంలో ఆనందాశ్చర్యాలు ఉట్టిపడుతుండగా కళ్లు పెద్దవి చేసి చూస్తూ "ఏమిటిది ?" అంది. "ప్రజంట్" అన్నాడు గర్వంగా. అప్పుడా కళ్లలో వెల్లివిరిసిన ప్రేమ, ఆప్యాయత, అభిమానం,

ఆనందం, ఆశ్చర్యం తనెన్నడూ మర్చిపోలేదు. పుట్టినరోజు పండగనాడు శారిక ఆ చీర కట్టుకొంటే, కట్టుకొని తనకి చూపిస్తుంటే మైమరిచిపోయాడు. ఆ మెరుపు, ఆ మురుపు, ఆ హొయలు, ఆ విన్యాసం వాటన్నిటి వెనక తొణికిసలాడే గౌరవ ప్రేమాభిమానాలు అతని కళ్లలో ఎప్పుడూ కదలాడుతూనే వుంటాయి.

"విష్ యూ ది బెస్ట్ ఆఫ్ లక్" అన్నాడు రాఘవ.

"విష్ యూ....యూ....ది బెస్ట్ ఆఫ్ లక్" అంది శారిక అతని వైపు వేలు చూపిస్తూ.

ఈలేస్తూ రాఘవ టెన్నిస్ రాకెట్ పట్టుకుని వరండాలోకి వచ్చాడు.

"శారిక వుందాండీ...."

అతను తలెత్తి చూశాడు "ఉందండీ" అంటూ.

చూసినవాడు అలాగే శిలాప్రతిమలా నిలబడిపోయాడు. ఆమె కూడా తలెత్తి చూసింది. దిగ్భ్రాంతి చెంది ఒక్క-క్షణం అచేతనంగా నిలబడిపోయింది. చేతిలోని హేండ్ బాగ్, పేకెట్టు కిందపడటం కూడా ఆమె ఎరగదు. అతని ముఖం కందగడ్డ అయింది. ఆమె ముఖమూ ఎర్రబడింది. అతనిలో గందరగోళం వరద వెల్లువ అయింది.

"శారిక....శారిక...." ఆమె తొట్రుపడింది. నేలమీది వస్తువులు చూసి తీసుకొంది.

"శారికా!" అని హీనస్వరంతో కేకేసి రాఘవ అక్క-డినించి గబగబ ముందుకి వెళ్ళిపోయాడు.

రాఘవ మనసు మనసులో లేదు.

కోమల!

అతను ముఖం చిట్లించుకున్నాడు. కోమలని చూసినా, తలచుకొన్నా మనసులో ద్వేషం, కసి తాచుపాముల్లా బుసలుకొడుతూ పడగలు విప్పుతున్నాయి. ఓ నెలకిందటి దాకా ఆమె ఎవరో, తనెవరో ! ఆరోజు ఎంత దుర్దినం ? మూడేళ్లు పట్టింది. తెలివితేటలు లేక కాదు. అతని ధ్యాసంతా టెన్నిస్ ఆటమీదే. చాలా టోర్నమెంట్లలో పాల్గొన్నాడు. ఒకటి రెండుసార్లు పెద్ద పోటీల్లో గెలిచాడు కూడా. పాసయింతరువాత ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు గాని అవి ఫలించలేదు ఇంకా.

టెన్నిస్ ఆటలో పేరు పొందాడు కనుక అతని చుట్టూ మిత్రులూ చేరారు, మిత్రులతోపాటు కొన్ని కొత్త అలవాట్లూ చేరాయి. హుషారెక్కించే మద్యం అప్పు డప్పుడు సేవిస్తే తప్పేం లేదనే మిత్రుల హితోపదేశం తలకెక్కి బార్లలో హాజరు అవుతున్నాడు. సిగరెట్లు ఊదేస్తున్నాడు. పొగడ్తలు అహంకారాతిశయాల పొరలు కప్పుతున్నాయి.

ఆ రోజు మిత్రులతో సినిమాకి వెళ్ళాడు. సినిమా చూస్తున్నంతసేపూ ఇతరు లకి చికాకు అనికూడా గమనించకుండా వాళ్లంతా వ్యాఖ్యానాలతో, నవ్వులతో ఒకటే గోల. ఇంటర్‌వెల్‌లో బయటికి వెళ్లి మళ్ళీ పిక్చర్ మొదలైంతరవాత దారి తడుము కుంటూ సీట్లలోకి చేరుకుంటున్నారు. రాఘవ చూడక ఓ అమ్మాయి కాలు తొక్కాడు.

"బ్రూట్" అందామె గట్టిగా.

రాఘవకి షాక్ తగిలినట్టయింది. "సారీ" అందామని అనుకున్నాడుగాని ఆమె మాట అతనికి ములుకులా తగిలి మనసు తిరగబడ్డది.

"చూడలేదండీ! అలా తొందపడతారేం?" అన్నాడు కొంచెం కటువుగా.

"షటప్" అందామె దురుసుగా.

రాఘవ వదనంలోకి రక్తం చిమ్మింది.

"బ్రూట్‌కి స్త్రీలింగం ఏమిటో?" అన్నాడు ఓ మిత్రుడు అర్ధస్వగతంగా.

"బ్రూటీ" మరో స్నేహితుడి జవాబు.

"కాదు, బ్యూటీ."

"పోలీస్ కంప్లెయింట్ ఇస్తేగాని రోడ్‌సైడ్ రోమియోలకి బుద్ధి రాదు" అందా అమ్మాయి కోపంతో రెచ్చిపోతూ.

"ఊరుకోవే కోమలా, ఎందుకు గొడవ" అంది పక్కన వున్న అమ్మాయి నెమ్మదిగా.

"ఒరే రాఘవా, క్షమాపణ కోరుకోరా" అన్నాడు ఎద్దేవగా ఓ మిత్రుడు ఎగసన తోస్తూ.

"నో, మేడమే క్షమాపణ కోరాలి" అన్నాడు రాఘవ దృఢంగా.

కొంచెం కలకలం రేగింది. చుట్టుపక్కల వాళ్లు కలగచేసుకొని సర్దేశారు. సినిమా వదిలింతరువాత ఆ అమ్మాయిలిద్దరూ తోడుగా నడిచి ఇళ్ళకి వెడుతున్నారు.

మిత్రుల ప్రోద్బలంతో రాఘవ వాళ్ళని అనుసరించాడు. ఓ క్రాస్ రోడ్ దగ్గిర కోమల స్నేహితురాలు విడిపోయింది. మరో రెండు నిమిషాల్లో కోమల ఓ ఇంటిముందు ఆగి గేటు తీసి లోపలికి పోబోతుంది.

"మేడమ్ ఆగండి."

కోమల తెల్లబోయి వెనక్కి చూసింది. ఓ ముగ్గురు తనని సమీపిస్తున్నారు. ఆమెకేదో మొండి ధైర్యం కలిగింది.

"ఏం కావాలి ?"

"మీరు మా రాఘవని అనవసరంగా అవమానించారు నలుగురిలో. మీరు అపాలజీ చెప్పాలి."

"చెప్పాలా ?"

"చెప్పి తీరాలి."

"ఆయన ఒక్కరికేనా, మీ అందరికీ చెప్పాలా ?"

"మా రాఘవకే, మాకెందుకు ?"

"అయితే మీరు కొంచెం వెనక్కి వుండండి."

వాళ్ళిద్దరూ ఈ ధోరణికి కొంచెం తికమక పడినా, అప్రయత్నంగా వెనక్కి తిరిగారు.

"మీరేం చేస్తుంటారు ?"

"టెన్నిస్ ప్లేయర్-ఛాంపియన్" గర్వంగా అన్నాడు రాఘవ.

"సర్వీస్ బాగా చేస్తారా ?"

"బూమింగ్"

"నా సర్వీస్ కూడా అంతే" అంటూ కోమల తటాలున కాలి చెప్పుతీసి రాఘవ ఆ దవడా ఈ దవడా వాయించి చప్పున లోపలికెళ్ళి దడాలున తలుపేసుకొంది.

ఈ హఠాత్సంఘటనకి రాఘవ దిమ్మరపోయాడు. మిత్రులు స్తంభీభూతు లయారు. రాఘవ అవమానంతో తలదించుకొన్నాడు. మిత్రులు ఆమెకి ఇంతకి ఇంతగా పరాభవం చేసి తీరాలని ప్రలాపించారు.

మర్నాడు ఎస్. ఐ. రాఘవకి కబురు చేశాడు.

"చూడు రాఘవా, ఎవరో కోమలట. బి.ఎ. థర్డియర్ట. కంప్లైయింట్ చేసింది. జరిగింది నీకు తెలుసు. నువ్వు నా ఫ్రెండ్‌వని ఆమెకి తెలీదు. కాని వ్యవహారాల్లో స్నేహం పనికిరాదు. టెన్నిస్ ఛాంపియన్ రాఘవ ఇలాచేశాడని ఆమె ఫిర్యాదు చేస్తే అదిరిపోయాను. మరి నా పరువూ, నీ పరువూ కాపాడటం నీ చేతిలోనే వుంది." మృదువుగానే అయినా దృఢంగానే అన్నాడు ఎస్.ఐ.

రాఘవ తల దించుకొని నిరుత్తరుడై తిరిగి వచ్చాడు. ఆనాటినించీ పరాభవాగ్ని అతన్ని దహిస్తోంది. మిత్రులు పురెక్కిస్తున్నారు. జీవితంలో ఆమె మర్చిపోలేనివిధంగా శిక్షించాలని రెచ్చగొడుతున్నారు. "అవును, శిక్షించాల్సిందే." అని నిశ్చయించు కున్నాడు రాఘవ. బ్రూట్ ! సరే, తను బ్రూట్ తప్పక అవుతాడు ! బ్రూట్....!

కోమలని అకస్మాత్తుగా తన ఇంటిముందు చూసినప్పటినించీ ఆ దృశ్యాలన్నీ అతని మనసుని వికలం చేయసాగాయి. బ్రూట్‌ట, ఆనాడు రాఘవుడి కాలు తగిలి ఓ రాయి కోమలి అయింది. ఈనాడు ఓ కోమల కాలు తగిలి ఓ రాఘవ బ్రూట్ అవు తున్నాడు. అతను విషాదంగా నవ్వాడు.

మేచ్ ఆడుతున్నంతసేపూ అవే దృశ్యాలు. టెన్నిస్ బాల్ ఎగరేసి సర్వీస్ చెయ్యబోతుంటే చెప్పుతీసి ఆమె ఫెడీమని కొడుతున్న దృశ్యం మనసులో మెదిలి డబుల్ ఫాల్ట్స్ చేశాడు.

తప్పక గెలుస్తాననుకొన్న మేచ్ సులభంగా ఓడిపోయాడు రాఘవ. మిత్రులు బార్‌కి తీసుకెళ్ళి ఓదార్చసాగారు. అతనేం వినటం లేదు. మనసునిండా ద్వేషం, కసి.

స్నేహితుల దగ్గిర సెలవు తీసుకొని ఇంటికి బయల్దేరాడు రాఘవ. మనసు క్రూరంగా ఆలోచిస్తోంది. కిడ్‌నాప్ చేసి....తటాలున ఓ ఊహ మెదిలింది. కోమల శారిక ఫ్రెండ్ అన్నమాట. క్లాస్‌మేట్ అయివుంటుంది. శారిక పేరు ఉపయోగించి తేలిగ్గా మోసగించవచ్చు. కాని 'ఛీ' అనుకొన్నాడు రాఘవ. దౌర్జన్యమే చేస్తాడు. బ్రూట్ ! ఫలితం ఏమైనా సరే ! అంతే.

ఫ్రెండ్‌కి ఏమైనా జరిగితే శారిక బాధపడుతుందేమోననిపించింది అతనికి. కాని బహుశా ఆమె శారికతో స్నేహం కూడా మానేస్తుంది, తనెవరో తెలిసింతరువాత ఆమె దుడుకుగా ప్రవర్తించి శారిక మనసులో విషబీజాలు నాటి అనరాని మాటలూ అని వెళ్ళి వుంటుంది. శారిక తనని ఇంటికెళ్ళగానే నిలదీసి అడుగుతుందేమో! అడక్క

పోయినా, లోపల మండిపోతూ వుంటుంది. ఇంత చేసిన ఆ కోమల ఎలాపోతే ఎవడిక్కావాలి.

రకరకాల ఆలోచనలతో, ప్లానుతో ఇల్లు చేరాడు రాఘవ. టెన్నిస్ రాకెట్ మూలకి విసిరేశాడు. ఎదురుగా శారిక దీనంగా కనిపించింది.

"పోయింది" అన్నాడు.

"ఊ!" అంది శారిక.

"ఎవరా ఫ్రెండ్? వెడుతుంటే ఎదురైంది. పరమ దుశ్శకునం" అన్నాడు కోపంగా, కసిగా.

"ఎవరు కోమలా? నా క్లాస్‌మేట్‌లే. తనేం చేసింది పాపం? ఇదే ఫస్ట్ టైం మనింటికి రావటం. నువ్వెందుకో బాగా ఆడలేదు. ఆదేం సర్వీస్ ?" అంది శారిక.

"ఫెయిలయ్యాను."

"అనుకోకుండా సమయానికి వచ్చింది కదా. తనని కూడా మేచ్ చూడటానికి రమ్మని ఆహ్వానించాను. ఇంకా నయం. ఇంటరెస్ట్ లేదని వెళ్ళిపోయింది."

"ఎందుకు ఇంటరెస్ట్ లేదు?" అనుమానంగా అన్నాడు.

"బావుందే, ఏమో!"

"నన్ను గురించి టాంటాం వేశావా?"

"ఇదే పనా నాకు? అసలు మనింట్లో సంగతులు నేనెవరికీ, ఎంత క్లోజయినా చెప్పను తెలుసా ? నువ్వు టెన్నిస్ ఛాంపియన్ వని తనకీ మనింటికొచ్చేదాకా తెలియదు."

"అసలెందుకొచ్చింది? ఏం చెప్పింది?" అన్నాడు రాఘవ ఆమె వైపు దీక్షగా చూస్తూ.

"ఫ్రెండ్స్ ఎందుకొస్తారు ? ఆ మధ్య ఓసారి ఇన్వైట్ చేశాలే. ఇవాళ సెలవు. పైగా ఇంట్లో ఎవరూ లేరు, తోచక వచ్చింది. చెప్పటానికేం వుంటుంది ?" ఆశ్చర్యంగా అతనివైపు చూసింది.

"ఇంట్లో ఎవరూ లేరా ?" ఆసక్తిగా అడిగాడు.

"తనూ, అమ్మేగా ఇంట్లో వుండేది అసలు. వాళ్ళది ఏదో పల్లెటూరు.చదువు కోసం వచ్చి వుంటున్నారు. ఏదో పనుందని వాళ్ళమ్మ పొద్దునే ఊరికెళ్ళింది. నాలుగు రోజులదాకా రాదుట."

రాఘవ మనసులో పైశాచికత్వం తాండవం చేసింది. అతని దృష్టి బల్లమీది పేకెట్‌మీద పడ్డది.

"ఏమిటా పేకెట్ ?"

"అదా ! అదీ...." సందేహించింది శారిక.

"అదీ....?"

"అదే. చీరలే, కోమల ఆ మధ్య కొన్నదిట. చూపిద్దామని తెచ్చింది. నేనూ నువ్వు తెచ్చిన చీర చూపించాలే" నసిగింది శారిక.

"మరి తీసికెళ్ళలేదేం ?" అంటూ పేకెట్ తీసిచూసి నిర్ఘాంత పోయాడు రాఘవ.

పచ్చటి కంచిపట్టు చీర !

"నీకు చూపిద్దామని—" అని అనబోయి చప్పున మానేసింది శారిక. రాఘవ ముఖం జేవురించింది. శారిక వదనం ముకుళించింది.

రాత్రి తొమ్మిదింటికి కోమల ఇల్లు చేరాడు రాఘవ. గదిలో లైట్ వెలుగు తోంది. తలుపు దగ్గిరగా వేసి వుంది. ఓహో! ధైర్యస్తురాలే. తలుపులు బిగించు కోలేదు. ఎంత ధైర్యం లేకపోతే ఆనాడు అలా అవమానిస్తుంది ! ఆ రాత్రి నాకు మాయని మచ్చ కోమలా ! ఈ రాత్రి నీకు....పిచ్చిగా నవ్వుకున్నాడు. తలుపులు భళ్లున తోశాడు.

అ శబ్దానికి త్రుళ్లిపడి తలుపువైపు చూసి తటాలున లేచి నిలబడింది కోమల. చింతనిప్పుల్లాంటి కళ్ళతో రాఘవ ! బిత్తరచూపులు చూసిందామె. నోట మాట రాలేదు.

రాఘవ తలుపులు మూశాడు.

కేక వెయ్యబోయింది కోమల. నోరు పెగల్లేదు. భయం భయంగా అటూ ఇటూ చూసింది. ఇటూ అటూ అడుగు వెయ్యబోయింది. తడబడింది. "ప్లీజ్" అనా లనే ఆమె ప్రయత్నం పెదవుల మధ్యే అణిగిపోయింది.

రాఘవ ఆమెవైపు క్రూరంగా చూస్తూ ముందుకి సాగబోయాడు. అడుగు ముందుకి పడలేదు. ఎర్రదీపమే అయిందామె ఎర్రఎర్రగా మెరిసిపోతూ. రాఘవ కళ్ళప్పగించి చూస్తున్నాడు మంత్రముగ్ధుడై.

అతని కళ్ళు మిరుమిట్లు కొలుపుతున్నాయి. అతను కోమలని చూస్తున్నా చూడటం లేదు.

ఆ మెరుపు –

ఆ మురుపు –

ఆ విన్యాసం –

ఆ హొయలు –

వాటి వెనక ఆ—ఆ—

రాఘవ పెదవులమీద చిరునవ్వు విరిసింది. అతను సర్వం మరిచాడు.

"శారీ" అన్నాడు రాఘవ కోమలవైపు ఆదేపనిగా చూస్తూ, అర్ధ స్వగతంగా.

కోమలి కళవళ పడింది.

"శారీ" అన్నాడు ఆర్ద్రంగా, ఆప్యాయంగా, మళ్ళీ

"ప్లీజ్" కోమల కేమీ అర్ధంకాక అతనివైపు చూస్తూ అంది.

ఆ మాటకి స్పృహ వచ్చినట్టయింది రాఘవకి. చుట్టూ చూశాడు. కోమలవైపు ఓసారి చూశాడు. తరువాత తలుపు భళ్ళున తెరిచి గబగబ బయటికి నడిచాడు.

అతనలా ప్రభంజనంలా వచ్చి ప్రశాంతంగా వెళ్ళిపోతుంటే ఆశ్చర్యంగా, వింతగా చూస్తూ నిలబడిపోయింది కోమల.

[ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక, దీపావళి 1986]